పనులు పూర్తయ్యేదెన్నడో?

- అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాల పనులు
- బిల్లులు అందక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- నియోజకవర్గంలో మంజూరైన భవనాలు - 78
- నేటికి పూర్తయినవి-2


శ్లాబ్‌దశలో నిలిచిపోయిన అరకులోయ-2 అంగన్‌వాడీ భవనం


గుమ్మగుడలో ఇంటి వద్ద నిర్వహిస్తున్న కేంద్రం


గుమ్మగుడలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

అరకులోయటౌన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు నిధులు మంజూరు చేసి, వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఆశయం ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో అమలు కావడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభం కాగా, ఎన్నికల కోడ్ కారణంగా చాలా చోట్ల పనులకు ఆటంకం కలిగింది.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు నిధులు విడుదల చేయలేదు. దీంతో పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయకపోడంతో పనులు నిలిపివేశారు. నియోజకవర్గంలోని చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి అధ్వానంగా ఉంది. శిథిల భవనాల్లో అరకొర సౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. బీటలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు.. వర్షం పడితే జలమయమవుతున్న గదులు దర్శనమిస్తున్నాయి. వర్షం కురిసినపుడు సరకులు తడిసిపోతున్నాయని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిల భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

అరకులోయ నియోజకవర్గ కేంద్రం పరిధిలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు మండలాల్లో మొత్తం 78 భవనాలు మంజూరు చేస్తే నేటికి కేవలం రెండు భవనాలు మాత్రమే పూర్తి చేశారు. దీంతో శిథిలావస్థ భవనాల్లో బిక్కుబిక్కుమంటూ అంగన్‌వాడీలు, చిన్నారులు కాలం వెళ్లదీస్తున్నారు. మరికొన్నిచోట్ల ప్రైవేట్ నివాస గృహాల్లో, మరికొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాల భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులందక, వడ్డీలు కట్టలేకపోతున్నామని వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు సంబంధించి నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని స్థానికులతో పాటు కాంట్రాక్టర్లు కోరుతున్నారు. త్వరితగతిన భవనాలు పూర్తి చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ భవనాల పరిస్థితి ఇలా...

- అరకులోయ మండలంలో మొత్తం 19 భవనాలు మంజూరు కాగా రెండు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇందులో చివరి దశలో-6 భవనాలు, లింటల్ లెవెల్‌లో-6, శ్లాబ్ వేసినవి-3, పునాదిస్థాయిలో -2 భవనాలున్నాయి.
- అనంతగిరి మండలాల్లో 22 భవనాలు మంజూరైతే.. చివరిదశలో-9 భవనాలు, శ్లాబ్ వేసినవి-6, రూఫ్ లెవెల్‌లో-3, లింటల్ లెవెల్‌లో-4 భవనాలు ఉన్నాయి.
- డుంబ్రిగుడ మండలంలో 16 భవనాలకు చివరి దశలో-6, లింటల్ దశలో-4, శ్లాబ్ వేసినవి-5, పునాది స్థాయిలో ఒక భవనం ఉంది.
- హుకుంపేట మండలంలో మొత్తం 10 భవనాలకు చివరి దశలో-3 భవనాలు, శ్లాబ్ వేసినవి-ఒకటి, పునాది స్థాయిలో-6 భవనాలున్నాయి.
- పెదబయలు మండలంలో 11 భవనాలు మంజూరు కాగా చివరి దశలో-5, రూఫ్ లెవెల్‌లో-4, శ్లాబ్ వేసినవి-ఒకటి, పునాది స్థాయిలో ఒక భవనాన్ని నిర్మించారు.

భవనాన్ని నిర్మించాలి



అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరడంతో అరకులోయలోని ప్రాథమిక పాఠశాల భవనంలోని ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీ భవనం శ్లాబ్ లెవెల్ వరకు నిర్మించి వదిలేశారు. దీంతో పాఠశాల భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం. నూతన అంగన్‌వాడీ భవనం పూర్తి చేసి అప్పగించాలి.

– కిల్లో సునీత, అంగన్‌వాడీ టీచర్, అరకులోయ-2

పనులు పూర్తిచేయాలి



గ్రామంలో అంగన్‌వాడీ భవనం లేక ఇంటి వద్దే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం. గ్రామంలో నిర్మించిన సెంటర్ పనులు శ్లాబ్ లెవెల్ వరకు నిర్మించి విడిచి పెట్టారు. బిల్లులందక పనులు నిలిపివేసినట్లు కాంట్రాక్టర్ చెబుతున్నారు. భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

– పాంగి పార్వతి, అంగన్‌వాడీ టీచర్, గుమ్మగుడ, అరమ పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

ప్రతిపాదనలు పంపాం



గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో శ్లాబ్ లెవెల్ వరకు అంగన్‌వాడీ భవనాలను కాంట్రాక్టర్లు నిర్మించారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిదులు విడుదల చేస్తే పనులు ప్రారంభిస్తాం.

– రామమ్, డీఈఈ, పీఆర్ ఇంజినీరింగ్ శాఖ, అరకులోయ

క్లుప్తంగా

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి


గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి శనివారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. గ్రామ సచివాలయం పరిధిలో పింఛన్ల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయానికి వస్తున్న ప్రజా సమస్యలపై గ్రామ సచివాలయ సిబ్బంది సకాలంలో స్పందించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు.

మారుమూల గ్రామాలకు రహదారులు


గిరిజన సంక్షేమశాఖ డీఈఈ రఘును కలిసిన నాయకులు

గూడెంకొత్తవీధి: మండలంలోని మారుమూల గ్రామాల్లో రహదారుల నిర్మాణంతో పాటు వంతెనలను నిర్మించాలని వంచుల పంచాయతీ నాయకులు కోటేశ్వరరావు, కొండలరావు, భూపతిలు కోరారు. చింతపల్లిలో గిరిజన సంక్షేమ శాఖ డీఈఈ రఘుని వారు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా తమ పంచాయతీలోని పలు గ్రామాలకు రహదారులు, అంతర్గత మార్గాలు, వంతెనలు, కల్వర్టులను నిర్మించి రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ప్రభుత్వానికి నివేదించి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు డీఈఈ రఘు తెలిపారు.

వయోజన విద్యకు ప్రాధాన్యం


సూచనలిస్తున్న ఎంఈవో బాబూరావుపడాల్

జి.మాడుగుల: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ఎంపీడీవో తేజ రతన్ అధ్యక్షతన వయోజన విద్య(ఉల్లాస్) పథకంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వెలుగు ఏపీఎంని మండల రిసోర్స్ పర్సన్‌గా వి.ఈశ్వర్‌బాబు నాయుడు, వీవోఏలు, సీసీలకు శిక్షణ ఇచ్చారు. అక్షరాస్యత పెంపునకు కేంద్రం ప్రభుత్వం చేపడుతున్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో బాబూరావుపడాల్ మాట్లాడుతూ అక్షరాస్యత పెంపునకు అందరూ కృషి చేయాలన్నారు. వయోజన విద్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు. వయోజన విద్య సహాయ ప్రాజెక్టు అధికారి కె.గంగన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పూజా సామగ్రి వితరణ


పూజా సామగ్రి అందజేస్తున్న ప్రసాద్

కొయ్యూరు: మండలంలోని చిట్టింపాడు పంచాయతీ గోపవరంలో ధార్మిక సంస్థల నేత, దాన ధర్మ సమితి ప్రతినిధి డి.వి.డి.ప్రసాద్ 1,019 ఆలయాలకు అవసరమైన నిత్య పూజా సామగ్రిని సంబంధిత దేవాలయాల అర్చకులకు శనివారం అందజేశారు. ప్రతీ ఆలయంలోను నిత్య పూజలు చేయాలని ఈ సందర్భంగా ఆయన అర్చకులను కోరారు. లోవరాజు, కృష్ణ, మంగ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు నిర్మాణానికి శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలో జెడ్పీ నిధులతో నూతన బోరు నిర్మాణ పనులకు శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, సర్పంచ్ జనం నోయిన, ఎంపీటీసీ సభ్యురాలు బజ్జింగి కమల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగబందు మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.1.40లక్షలతో బోరు ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. గ్రామంలో తాగునీటి సమస్యను జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి బోరు మంజూరు చేశారన్నారు. దీంతో పాటు త్వరలోనే జెడ్పీ నిధులు రూ.5లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. గ్రామ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరావు, ముల్యా, నీలాంబరం, భగత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ జానకమ్మ

డుంబ్రిగుడ: అరకు సంతబయలులో ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో బాల్య వివాహాల అనర్థాలపై శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే తక్షణమే అధికారులకు సమాచారం అందించి నిలిపివేయాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ జి.శారద తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం


ఎస్ఐ రవీంద్రను సన్మానిస్తున్న సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఎస్ఐగా పని చేసి బదిలీపై సీలేరు వెళ్తున్న రవీంద్రకు వీడ్కోలు సభను పోలీసు సిబ్బంది శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ ఎస్ఐ రవీంద్ర చేసిన సేవలను కొనియాడా రు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌లు రమేష్, నీలకంఠం, గంగాధర్, వైఎస్సా ర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, వివిధ పార్టీల నాయకులు అప్పారావు, తిరుపతిరావు, శాస్త్రిబాబు, నీలకంఠం పాత్రో, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, వర్తకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సమస్యలపై ఎంపీకి వినతి


అరకు ఎంపీ తనూజరాణికి వినతిపత్రం ఇస్తున్న మినుములూరు ఆస్పత్రి వైద్య బృందం

సాక్షి, పాడేరు: అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణిని మినుములూరు పీహెచ్‌సీ వైద్య బృంద సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సమావేశ మందిరం, మరుగుదొడ్లు తదితర సమస్యలను డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది తదితరులు వివరించారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ పీహెచ్‌సీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైద్య సిబ్బంది వరలక్ష్మి, సింహాద్రి, నాగరాజు, లక్ష్మణరావు, చలం, శంకర్, సుశీల, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను కలిసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండలంలో ఎన్.ఆర్.పురం గ్రామ సమీపంలో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, ఇళ్ల నిర్మాణం, పింఛన్లు తదితర సమస్యలపై వినతులను ఎమ్మె ల్యే మత్స్యలింగంనకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వినుతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కా రానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ నీలవేణి, ఎంపీటీసీ సభ్యురాలు మితుల, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగన్నదొర, స్వామి, డానియల్, అశోక్‌కుమార్, సూర్యనారయణ, రామకృష్ణ, తవిటినాయుడు, చిన్నారావు, సన్నమ్మ, సత్యవతి తదితర లు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన


రాచపనుకులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అనూషదేవి

చింతపల్లి: మండలంలో అన్ని గ్రామాలకు మౌలిక సౌకర్యాలు కల్పనే ధ్యేయంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఎంపీపీ అనూషదేవి అన్నారు. కిటుముల పంచాయతీ పరిధిలోని రాచపనుకు గ్రామంలో రూ.8లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మన్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. మండలంలో అన్ని పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళిక చేపడుతున్నామన్నారు. గత వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో పాటు మండల పరిషత్ నిధులతో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి బోర్లు, పలు భవనాల మరమ్మతు పనులు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యు లు పద్మ, మోహనరావు, లోవరాజు, పీఆర్ జేఈ బాలకిషోర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ జోలికొస్తే సహించేది లేదు


ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

అరకులోయ రూరల్: దాబుగుడ మైనింగ్ జోలికి వస్తే దేనికైనా సిద్ధమే అని మైనింగ్ ప్రభావిత ప్రాంతాల ఆదివాసీ గిరిజనులు శనివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని మాదల పంచాయతీ దాబుగుడ అటవీ ప్రాంతంలో మైనింగ్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని గిరిజనులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు రమేష్ మాట్లాడుతూ దాబుగుడ మైనింగ్ తవ్వకాలు జరిపితే దోమలుజోరు, రత్తకండి, పొట్టంగిపాడు, కమలతోట, సరుబెడ్డ, గ్రామలను పూర్తిగా దెబ్బతింటాయన్నారు. తాగునీటి కోసం ఆధారపడుతున్న ఊటగెడ్డలు నిర్వీర్యమవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం మైనింగ్ తవ్వకాల యోచనను విరమించుకోవాలని లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 6న మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో బహిరంగ సభ నిర్వహించనున్నామని, గిరిజనులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు అప్పన్న, గోపాల్, రామన్న, రామ్మూర్తి, గాసి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణన


పనసలపాలెంలో పశుగణనలో పాల్గొన్న ఎంపీపీ ఆనందరావు, సర్పంచ్ నరసింహమూర్తి

వై.రామవరం: మండలంలో గత నెల 25 నుంచి ప్రారంభమైన పశుగణన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ వీరేంద్ర అధ్యక్షతన శనివారం పనసలపాలెం గ్రామంలో నిర్వహించిన పశు గణన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, సర్పంచ్ రోలుపల్లి నరసింహమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటా పశు గణన చేశారు. ఎంపీపీ, సర్పంచ్‌ల చేతులమీదుగా అందజేసిన స్టిక్కర్లను సిబ్బంది ఇళ్లకు వెళ్లి అతికించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరేంద్ర మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు పశుగణన కార్యక్రమం కొనసాగుతుందని, దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు. సచివాలయ సిబ్బంది, పశు సంవర్ధక శాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ


వై.రామవరంలో సూచనలిస్తున్న అధికారులు

కొయ్యూరు: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం సచివాలయ సిబ్బందికి వృత్తి నైపుణ్యాభివృద్ధిపై (స్కిల్ డవలప్‌మెంట్)పై శిక్షణ ఇచ్చినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో సెన్సస్ సర్వేపై మండల స్థాయి కమిటీ శిక్షణ ఇచ్చిందన్నారు. మండలంలోని మూడు సచివాలయాలకు చెందిన సిబ్బంది హాజరైనట్టు తెలిపారు. వారికి అనేక అంశాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు.

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన స్కిల్ కో–ఆర్డినేటర్ ఆనంద్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సర్వేను నిర్వహించే విధానంపై అవగాహన కల్పించారు. మండల దిగువ ప్రాంత 11 పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొని శిక్షణ పొందారు. మండల ఎగువ ప్రాంత సిబ్బందికి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


లోదొడ్డిలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి గ్రామంలో ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 70 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్టు వైద్యాధికారి భవానీ తెలిపారు. శిబిరంలో 35 మంది గ్రామస్తులకు కూడా పరీక్షించామన్నారు. మలేరియా నిర్ధారణ రక్త పరీక్షలు, హెమోగ్లోబిన్ స్క్రీనింగ్ టెస్టులు చేసినట్టు తెలిపారు. బీపీ సుగర్ సమస్య ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌వీ చిన్నయమ్మ, ఏఎన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు శామ్యూల్, రాంబాబు, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశ వర్కర్లు మల్లేశ్వరి, వెంకటలక్ష్మి, ఏసమ్మ పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్


గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రాధిక, నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో కొత్తభల్లుగుడ పంచాయతీ పరధిలో శనివారం సర్పంచ్ కొర్రా రాధిక పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. పంచాయతీ నిధులతో కొత్త భల్లుగుడలో చేపడుతున్న రచ్చబండ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. వివిధ గ్రామల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వం ద్వారా పీవీటీజీలకు చేపడుతున్న గృహ నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సకాలంలో బిల్లులు మంజూరు చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. అధికారులు బిల్లులు సత్వరమే అందిస్తే పనులు త్వరగా జరుగుతాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇస్తున్న బిల్లులు అదనంగా పెంచాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, ఏల్లేష్, రాంబాబు ,అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


జడ్డంగిలో స్వయంభూ భ్రమరాంభికామల్లిఖార్జున స్వామి

రాజవొమ్మంగి: పరమ పవిత్రంగా భావించే కార్తీక మాసం తొలిరోజు శనివారం భక్తులు విశేషపూజలు చేశారు.తెల్లవారుజామున దీపారాధన నిర్వహించారు. అరటిడొప్పల్లో నేతి దీపాలు వెలిగించి, నైవేద్యం సమర్పించిన తరువాత నీటి మడుగుల్లో వదిలిపెట్టారు. పలువురు ఇళ్లలోనే నీటితొట్టెల్లో దీపాలు వదిలిపెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. తులసి కోట వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం దగ్గరలోని శివాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం దీపారాధన నిర్వహించారు. మండలంలోని జడ్డంగి, వాతంగి, రాజవొమ్మంగి కొండపై శివాలయాలు భక్తులతో కళకళలాడాయి.

5న కంటి వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు మండల ఆప్తామలిక్ అసిస్టెంట్ కిషోర్ కుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంటి సమస్యలున్న వారికి ఉచితంగా పరీక్షలు చేస్తామని, అవసరమైన వారికి విశాఖలోని ప్రభుత్వ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించి శస్త్రచికిత్స చేస్తామన్నారు. పేషెంట్‌కు ఉచితంగా రవాణా, భోజనం సదుపాయం కల్పిస్తామని, మరిన్ని వివరాలకు పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు.

అవినీతి నిర్మూలనకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

గంగవరం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు, గంగవరం ఎస్ఐ డి.భూషణం మాట్లా డుతూ అవినీతి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. నిజాయితీని ప్రోత్సహించడం , బాధ్యతాయుతంగా పనిచేయడం వంటి విలువలను ప్రజల్లో పెంపొందించడానికి ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఎల్ఐసీ అందిస్తున్న సేవలను కొనియాడారు. గోకవరం ఎల్ఐసీ సీనియర్ బ్రాంచి మేనేజర్ విద్యాసాగర్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు సంబంధించి ప్రచార కార్యక్రమాలను ఎల్ఐసీ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామసచివాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.